క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణానికి కొలతలు వేస్తున్న దృశ్యం

నందవరం: మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టుఆరు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కింద మంజూరైన నిధులతో శుక్రవారం మాల వీధి, గొల్ల వీధి, మైనార్టీ కాలనీలో పంచాయతీ రాజ్ ఏఈ జయన్న ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులకు కొలతు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్, నాయకులు రమేశప్పగౌడ్, ఎల్లాగౌడ్, దత్తాత్రేయగౌడ్, వీరేష్ పాల్గొన్నారు.

దస్తగిరయ్యస్వామి కట్ట ప్రారంభం



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన దస్తగిరయ్య స్వామి కట్టను శుక్రవారం గ్రామస్తులు ప్రారంభించారు. దర్గాను ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారికి ప్రార్థనలు చేశారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

బాలుడిపై దున్నపోతు దాడి

నందవరం: మండలంలోని జగ్గాపురం గ్రామంలో 11 ఏళ్ల బాలుడిపై దున్నపోతు దాడి చేసింది. శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. జింక రామయ్య, మాధవీ దంపతుల కుమారుడు నరసింహులు చెరువులో స్నానానికి వెళ్లాడు. ఈక్రమంలో దున్నపోతు కొమ్ములతో దాడి చేసింది. బాలుడికి ఎడమ పక్క పొట్టపై తీవ్ర రక్త గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స నిమిత్తం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

జోడో యాత్ర విజయవంతంపై బైక్ ర్యాలీ

ఎమ్మిగనూరు టౌన్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ జోడో పాద యాత్ర విజయవంతంగా ముగియడంతో ఆదివారం మంత్రాలయం నుంచి మాధవరం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ శుక్రవారం తెలిపారు.

కంపచెట్లు తొలగింపు

మద్దికెర: మండల కేంద్రంలో ఈనెల 2న విజయదశమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గుర్రాల పారువేట సందర్భంగా మద్దికెర నుంచి బొజ్జనాయునిపేట వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు.

భూమిలో తేమ ఉంటేనే విత్తనం వేయండి

మద్దికెర: రైతులు రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు సంబంధించి భూమిలో తేమ ఉంటేనే విత్తనం వేయాలని ఏఓ రవి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నవంబర్ 15 వరకు విత్తనం వేసుకోవచ్చన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల ఎండలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.

రబీ పంటల సాగులో అన్నదాతలు

కృష్ణగిరి: మండలంలో రబీ పంటల సాగు ఊపందుకుంది. నల్లరేగడి భూములు ఉన్న గ్రామాల్లో వర్షం లేకపోయినా అన్నదాతలు విత్తన పనుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం టి.గోకులపాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, తొగర్చేడు గ్రామ పొలాల్లో జొన్న, శనగ విత్తనాలు వేస్తున్నారు. పోతుగల్లు, రామకృష్ణాపురం, మన్నెకుంట గ్రామాల్లో రబీసాగులో అన్నదాతలు బిజీగా ఉన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి

ఎమ్మిగనూరు టౌన్: కౌలు రైతులకు ఎలాంటి షూరిటీలు, శరతులు లేకుండా పంట రుణాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు పంపన్న గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న కోరారు. శుక్రవారం కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘ నాయకులు నరసింహులు, మల్లికార్జున గౌడ్, ఇస్మాయిల్, శాంతప్ప, వీరేష్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

హొళగుంద: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని విద్యాశాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిబేష్, పంపాపతి, లక్ష్మప్ప, తుకారా, రేణుక, మల్లయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు పేదలకు వరం

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు పేదలకు వరమని పలువురు పేర్కొన్నారు. పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పలు చోట్ల శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని పలువురికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఆరోగ్య సిబ్బంది ముందుగానే ఇంటింటికి తిరిగి వైద్య శిబిరాల గురించి అవగాహన కల్పించడంతో ప్రజలు భారీగా తరలివచ్చి వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.



ఎల్ నగరం హెల్త్ క్యాంప్‌లో ఓపీలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు



రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఎల్ నగరంతో పాటు ఎల్ కొట్టాల, పిక్కిలివాని పల్లె, ఎల్ తండా, దాసరదొడ్డి తండా నుంచి 1,181 మంది హాజరై వైద్య సేవలు పొందారు. గోవర్ధనగిరి, రామళ్లకోట పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ నవీన్‌కుమార్, ప్రతిభ, కర్నూలు స్పెషలిస్టులు పృథ్వీ, కిరణ్‌కుమార్, ఆప్తాలిస్టు కవితతో పాటు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వైద్య చికిత్సలు నిర్వహించి, మందులు అందించారు. ఆరుగురిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. 11 మందికి కంటి అద్దాలు అందజేశారు. మరో 29 మందికి చికిత్సలకు సిఫారసు చేశారు. సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సర్పంచ్ మహేశ్వరి, గోవర్ధనగిరి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఏ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ముగతిలో..

నందవరం: మండలంలోని ముగతి గ్రామంలో సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 465 మందికి డాక్టర్లు చికిత్స చేశారు. 15 మందికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథ రామయ్య, డాక్టర్లు విజయభారతి, సౌజన్యలత, శైలజ, సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కులుమాలలో..

గోనెగండ్ల: మండలంలోని కులుమాల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి, జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ ఆఫీసర్ నూకరాజు పరిశీలించారు. వైద్యం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు రంగరవళి, అపర్ణ, వివేక్, లలిత పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈఓఆర్డీ నాగేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈఓలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సిద్ధాపురంలో..

హాలహర్వి: మండలంలోని సిద్ధాపురం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ వైద్యులు తిమ్మన్న, మన్సూర్‌వలీ రోగులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంతోనీ, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీటీసీ గాదిలింగప్ప, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, వీఆర్వో తిప్పన్న, సీహెచ్ఓ ఆదినారాయణ, సూపర్‌వైజర్ అబ్రహం, సుగుణ, ఏఎన్ఎంలు, గైనకాలజిస్ట్ మాధురి, సుజాత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చందన పాల్గొన్నారు.

జి.ఎర్రగుడిలో..



జి.ఎర్రగుడిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తుగ్గలి: మండల పరిధిలోని జి.ఎర్రగుడిలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ల బృందం పలువురికి బీపీ, షుగరు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కొందరిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ అన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణ నాయక్, నాయకులు దేవేంద్రారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు న్యూటన్, రాధ, కర్నూలు పెద్దాసుపత్రి నుంచి వచ్చిన జనరల్ సర్జన్ రమేశ్‌నాయక్, ఆదోని మధు హాస్పిటల్ డాక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, కంటి వైద్యులు 422 మందికి వైద్య సేవలు అందించారు. కొందరికి మందులు పంపిణీ చేశారు. మెరుగైన చికిత్స కోసం 24 మందిని రెఫర్ చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. శిబిరాన్ని పత్తికొండ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ రఘురామిరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుహాసినమ్మ, సర్పంచ్ వన్నమ్మ, పంచాయతీ సెక్రటరీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెడబుడకలో..

దేవనకొండ: మండలంలోని జిల్లెడబుడకల గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో దాదాపు 300 మందికి వైద్యులు అరుణ్‌జ్యోతి, విజయభాస్కర్ వైద్య సేవలు అందించారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తుల గురించి ఆరా తీసి, వారికి కర్నూలు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలకు రెఫర్ చేశారు. వైద్యులు పుష్పలత, భార్గవిలు రోగులను పరీక్షించి మందలు అందజేశారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.



ఎల్ నగరం హెల్త్ క్యాంప్‌లో మందుల పంపిణీ చేస్తున్న దృశ్యం



ముగతిలో బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



జిల్లెడబుడకలో రోగులను పరిశీలిస్తున్న వైద్యులు

దూదేకొండ గ్రామంలో..



దూదేకొండలో బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారి అరుణ్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసి పౌష్టికాహారం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు ముజుబుర్ రహిమాన్, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెసలదిన్నెలో..



పెసలదిన్నె శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్వరప్రసాద్

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని పెసలదిన్నె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. దైవందిన్నె పీహెచ్‌సీ డాక్టర్ మహేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. శిబిరంలో సర్పంచ్ కురవ భీమక్క, నాయకులు ఎంకప్ప, డాక్టర్ సాయికిరణ్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మరకట్టు గ్రామంలో ..



మరకట్టులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మారుతి

ఆలూరు రూరల్: మండలంలోని మరకట్టు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 481 మంది రోగులకు డాక్టర్ మారుతి, శాంతి ఆధ్వర్యంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ అల్లబకష్, పంచాయతీ కార్యదర్శి విజయ్ హెల్త్ సూపర్‌వైజర్లు ఆండ్రూస్, బాషా, చంద్రకళ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్, మండల పరిధిలోని కలుగొట్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్వహణలో భాగంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, తదుపరి 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉంటుందని, వినియోగదారులు, రైతులు గుర్తించాలని ఏఈ కోరారు.

కొలనుభారతి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే



కొలనుభారతి అమ్మవారి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే కంగటి శ్రీదేవి

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతిదేవి అమ్మవారిని పత్తికొండ ఎమ్మెల్యే కంగటి శ్రీదేవి శుక్రవారం దర్శించుకున్నారు. ఈఓ మోహన్ ఆలయ పురోహితులతో కలసి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఎమ్మెల్యే కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. సప్తశివాలయాల్లోని దేవాతామూర్తులను దర్శించుకున్నారు. అక్కడే ఉన్న ఛారుఘోషిని నదిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఆలయ పురోహితులు ఎమ్మెల్యే శ్రీదేవికి అమ్మవారి చిత్రపటం, చీరె, సారే సమర్పించారు.

కోసిగిలో చోరీ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాళెం కాలనీలో సూగూరేశ్వర దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఆర్ఎంపీ వైద్యుడు ప్రభాకర్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఆరోగ్యం సరిగ్గా లేక పోవడంతో సోదరుడు ఇంట్లో రాత్రి ఉండి పోయాడు. వేకువ జామున ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగిలి ఉంది. ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించి ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న రూ10వేల నగదు, 4 తులాల బంగారు అపహరించికెళ్లినట్లు బాధితుడు వాపోయాడు.

వృద్ధుడిపై దాడి

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని కునిమహాల్‌లోని హోటల్‌లో టీ తాగేందుకు వెళ్లిన వృద్ధుడిపై ఓ వ్యక్తి శుక్రవారం దాడి చేశారు. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు నబీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కునిమహాల్‌లోని ఓ హోటల్ నందు టీ తాగేందుకు వెళితే అక్కడ గౌస్ అనే వ్యక్తి మద్యం మత్తులో తనపై కామెడీ చేశారనానరు. నీ వయసెంత, నా వయసెంత అన్నందుకు నాపై జగ్గుతో తలపై కొట్టాడని చెప్పారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటు కోసం స్థల వివాదంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఎస్ఐ తిమ్మయ్య, స్థానికులు తెలిపిన వివరాలు.. శుక్రవారం గ్రామంలో పెద్దమ్మ అవ్వ ఆలయం వద్ద వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థలం కోసం ఓ సామాజిక వర్గం వారు అక్కడ ఉన్న దుకాణాలను తొలగించేందుకు సిద్ధమయ్యారు. మరో సామాజిక వర్గం వారు ఆలయం సొంతంగా నిధులతో నిర్మించుకున్నామని, షాపులను తొలగించ వద్దని నివారించారు. దీంతో రెండు సామాజిక వర్గాల వారు రాళ్లు, కర్రలతో ఘర్షణకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మయ్య, ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసుల సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఘర్షణలో ఓ సామాజిక వర్గానికి చెందిన మహాదేవి తలకు రక్త గాయం కాగా, జమలప్ప, తాయన్నకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహాదేవిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు సామాజిక వర్గాలకు చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

సరస్వతీ.. నమోస్తుతే!

దశసరా శర న్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

● భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



కటారుకొండలో సరస్వతి దేవిగా దుర్గాదేవి



పెరవలిలోని పూజలందుకుంటున్న సరస్వతీదేవి



టి.సోమలగూడూరులో సరస్వతీ దేవిగా అమ్మవారు

కటారుకొండలో

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండలో దేవీ శవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

మద్దికెర మండలంలో..

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి శ్రీరంగనాథ స్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు సరస్వతీ రూపంలో దర్శనమిచ్చారు. మద్దికెర మద్దమాంబ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మహామంగళ హారతి ఇచ్చారు. పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేసి అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారికి పల్లకీ సేవ అనంతరం పాన్పు సేవ నిర్వహించారు.

టి.సోమలగూడూరులో..

నందవరం: మండలంలోని టి.సోమలగూడూరు గ్రామంలో అమ్మవారు పెద్దమ్మ తల్లి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు, భక్తులు అమ్మవారి వద్ద పుస్తకాలు ఉంచి ప్రత్యేక పూజాలు నిర్వహించి హారతులిచ్చారు. పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలూరులో..

ఆలూరు: స్థానిక వాసవిదేవీ ఆలయంలో కన్యకాపరమేశ్వరిదేవీ భక్తులకు సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అంతకుముందు అమ్మవారికి కుంకుమార్చన, ఫల, పుష్ప పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆస్పరిలో గాయత్రీ దేవిని సరస్వతి దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో మద్దమాంబ అమ్మవారు



సరస్వతి దేవి అలంకరణలో వాసవిదేవి

హనుమప్ప అంత్యక్రియలు పూర్తి

మద్దికెర: సీపీఐ నాయకులు హనుమప్ప అంత్యక్రియలు మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. మృతదేహంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య, నాయకులు భీమలింగప్ప, రాజాసాహెబ్, నాగరాజు, కోదండరాముడు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

దోమల నివారణకు ఫాగింగ్

హొళగుంద: దోమల నివారణకు మార్లమడికి, ముద్దటమాగి గ్రామ వీధుల్లో ఫాగింగ్ చర్యలు చేపట్టారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించామని సర్పంచ్ యంకప్ప శుక్రవారం తెలిపారు. చెత్తచెదారం, మురుగు నీరు వీధుల్లో చల్లకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు.

నేడు ఉపాధి హామీ పథకంపై బహిరంగ సభ

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శనివారం ఉపాధి పనుల సామాజిక తనిఖీ బహిరంగ సభ ఉంటుందని ఎంపీడీఓ సుహాసినమ్మ, ఏపీఓ భక్తవత్సలం శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 17 గ్రామ పంచాయతీల్లో చేసిన ఉపాధి పనులు గురించి సామాజిక బృందం సభ్యులు సేకరించిన వివరాలను సభలో వెల్లడిస్తారన్నారు. సభకు ఉపాధి కూలీలు, ప్రజలు, అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

రైతులను ఆదుకోవాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఆలూరు: తీవ్ర వర్షాభావం వల్ల ఖరీఫ్‌లో నష్టపోయని రైతులకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొలగవెల్లి, హులేబీడు, మనేకుర్తి, అంగస్కల్లు తదితరుల గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ కింద సాగుచేసిన వేరుశెనగ, పత్తి, కొర్ర, టమాట, ఉల్లి పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. తీవ్రంగా నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో ఈ ఏడాదిలో అతితక్కువ వర్షపాతం నమోదైందన్నారు. సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయాయన్నారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట జిల్లా సీపీఐ కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా నాయకులు జగన్నాథ్, రైతు సంఘం కార్యదర్శి తిమ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు భూపేష్ తదితరులు ఉన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- పాలవ్యాన్‌తోపాటు బైక్‌ను ఢీకొట్టిన బొలెరో
- నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరారెడ్డి

ఆదోనిఅర్బన్ : పట్టణశివారు ఎమ్మిగనూరు రోడ్డులో శుక్రవారం పాల వ్యాన్‌తోపాటు బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులకు బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదోనికి నరసారావుపేట నుంచి బొలెరోలో డ్రైవర్ సింహాద్రి, వాహనం ఓనర్ రవితేజ వస్తున్నారు. ఈ క్రమంలో ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు పాల వ్యాన్‌లో స్థానిక అమరావతినగర్‌కు చెందిన చరణ్ వెళ్తున్నాడు. ఎమ్మిగనూరు రోడ్డులో పాలవ్యాన్‌ను ఢీకొట్టిన బొలెరో డ్రైవర్ ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు బైక్‌పై వెళ్తున్న సిరాలదొడ్డి గ్రామానికి చెందిన వీరారెడ్డిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పాలవ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సింహాద్రి, రవితేజ, చరణ్, వీరారెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలియజేశారు.



బోల్తాపడిన పాల వ్యాన్